సాక్షి
గ్రేటర్ వరంగల్
(హనుమకొండ - వరంగల్)

శుక్రవారం | 24 | నవంబర్ | 2023

సాక్షి గ్రేటర్ వరంగల్

(హనుమకొండ - వరంగల్)

శుక్రవారం | 24 | నవంబర్ | 2023



ఓటు హక్కుపై ఫ్లాష్‌మాబ్

ఓటు హక్కు ప్రాముఖ్యాన్ని వివరిస్తూ స్వీప్ ఆధ్వర్యంలో వరంగల్ నగరంలోని ములుగు రోడ్డు, పబ్లిక్ గార్డెన్ జంక్షన్, అమరవీరుల స్తూపం వద్ద ఎల్‌బీ, పింగిళి కళాశాలల విద్యార్థులు గురువారం నిర్వహించిన ఫ్లాష్ మాబ్ ఆకట్టుకుంది. స్వీప్ నోడల్ అధికారి హరిప్రసాద్ మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల్లో యువ ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకొని ఇతరులకు స్ఫూర్తిగా నిలవాలని కోరారు. - హన్మకొండ అర్బన్

న్యూస్‌రీల్

కేడీసీలో స్పాట్ అడ్మిషన్లు

విద్యారణ్యపురి: హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో వివిధ కోర్సుల్లో మిగిలిన సీట్ల భర్తీకి ఈనెల 25న స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు కేడీసీ ప్రిన్సిపాల్ జి.రాజారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సీపీ గేట్ అర్హత సాధించిన వారు ఈస్పాట్ అడ్మిషన్లు పొందవచ్చని పేర్కొన్నారు. అర్హత సాధించని, డిగ్రీలో కనీసం 50 శాతం మార్కులు సాధించిన విద్యార్థులు కూడా స్పాట్ అడ్మిషన్లు పొందవచ్చని తెలిపారు. కేడీసీలో ఎంఏ తెలుగు, ఎంఏ ఇంగ్లిష్, ఎంకామ్, ఎమ్మెస్సీ ఫిజిక్స్, ఎమ్మెస్సీ మైక్రోబయాలజీ, ఎమ్మెస్సీ కెమిస్ట్రీ, ఎమ్మెస్సీ కంప్యూటర్ సైన్స్‌లో మిగిలిన సీట్లలో స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియను ఈనెల 25న ఉదయం 10:30 గంటలకు నిర్వహించనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు కళాశాలలో సంప్రదించాలని ప్రిన్సిపాల్ సూచించారు.

27న జిల్లా స్థాయి ఖోఖో ఎంపికలు

హన్మకొండ: ఈనెల 27న హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి జూనియర్స్ విభాగంలో బాలబాలికలకు ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు ఖోఖో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి తోట శ్యాంప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు 27న ఉదయం 9గంటలకు స్టేడియం వద్దకు పుట్టిన తేదీ సర్టిఫికెట్‌తో హాజరు కావాలని సూచించారు. ఇంటర్మీడియెట్ విద్యార్థులు ఒరిజినల్ ఎస్సెస్సీ మెమో తీసుకుని రావాలని సూచించారు. ఎంపికలో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు డిసెంబర్ 8 నుంచి 10వ తేదీ వరకు నిజామాబాద్ జిల్లా నందిపేటలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. డిసెంబర్ 31, 2005 తర్వాత జన్మించిన వారు అర్హులుగా పేర్కొన్నారు. ఈపోటీల్లో పాల్గొనే క్రీడాకారుల ఇండెక్స్ ఎత్తు, వయస్సు, బరువు 250 పాయింట్లు మించి ఉండకూడదని తెలిపారు.

ఎంటెక్ రెండో సెమిస్టర్ పరీక్ష ఫీజు చెల్లించాలి

కేయూ క్యాంపస్: ఎంటెక్ మొదటి సంవత్సరం రెండో సెమిస్టర్ విద్యార్థులు పరీక్ష ఫీజు చెల్లించాలని కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య పి.మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి రాధిక గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అపరాధ రుసుము లేకుండా డిసెంబర్ 5 వరకు గడువు ఉందని, రూ.250 అపరాధ రుసుముతో డిసెంబర్ 8 వరకు పరీక్ష ఫీజు చెల్లించుకోవచ్చని వారు తెలిపారు. రెగ్యులర్ విద్యార్థులకు పరీక్ష ఫీజు రూ.1300, బ్యాక్‌లాగ్స్ రెండు పేపర్లకుపైన రూ.1,200, బ్యాక్‌లాగ్స్ రెండు పేపర్ల వరకు రూ 600లు, ఇంప్రూవ్‌మెంట్ ప్రతీ పేపర్‌కు రూ.300ల చొప్పున చెల్లించాల్సి ఉంటుందని వారు తెలిపారు.

ఎల్‌ఎల్‌బీ ఫలితాలు విడుదల

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఈఏడాది సెప్టెంబర్–అక్టోబర్‌లో నిర్వహించిన ఎల్‌ఎల్‌బీ వివిధ సెమిస్టర్ల పరీక్షల ఫలితాలను పరీక్షల విభాగం అధికారులు విడుదల చేశారు. ఎల్‌ఎల్‌బీ మూడేళ్ల కోర్సు రెండో సెమిస్టర్, నాలుగో సెమిస్టర్ పరీక్షల ఫలితాలు, ఐదేళ్ల లా కోర్సు రెండో సెమిస్టర్, నాలుగో సెమిస్టర్, ఆరో సెమిస్టర్, 8వ సెమిస్టర్ పరీక్షల ఫలితాలను విడుదల చేసినట్లు గురువారం కేయూ అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ రాధిక తెలిపారు. ఆయా పరీక్షల ఫలితాల్ని సంబంధిత కేయూ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు.

26న 'జాగో ఓటర్ జాగో'



హన్మకొండ అర్బన్: ఈనెల 26న పబ్లిక్‌గార్డెన్‌లోని టౌన్‌హాల్‌లో సులక్ష్య సేవా సమితి ఆధ్వర్యంలో ఓటర్ల చైతన్యం కోసం 'జాగో ఓటర్ జాగో' సదస్సు నిర్వహిస్తున్నట్లు సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మండువ సంతోశ్ తెలిపారు. గురువారం సదస్సుకు సంబంధించిన కరపత్రాలు, పోస్టర్లను కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆవిష్కరించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఓటర్లను చైతన్యపర్చేందుకు యువత ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఇలాంటి కార్యక్రమాలకు జిల్లా యంత్రాంగం పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందని తెలిపారు.

రేపటి నుంచి కొమ్మాల ఆలయంలో పవిత్రోత్సవాలు



గీసుకొండ: మండలంలోని ప్రసిద్ధ కొమ్మాల లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో ఈనెల 25 నుంచి 27 వరకు పవిత్రోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఈఓ శేషగిరి తెలిపారు. ఆలయంలో భక్తులు, అధికారులు, ఉద్యోగులు తెలిసీతెలియక చేసిన తప్పిదాలు, దోషాల నివారణకు, ఆలయ పవిత్రతను కాపాడేందుకు ప్రతీ ఏటా పవిత్రోత్సవాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించి మొక్కులు చెల్లించాలని కోరారు.

తారస్థాయికి ప్రచారం

ఓరుగల్లుకు వరుస కడుతున్న అగ్రనేతలు

- ఎన్నికల ప్రచారానికి ఐదు రోజులే గడువు
- నేడు ములుగు, భూపాలపల్లికి సీఎం కేసీఆర్
- పాలకుర్తికి ఏఐసీసీ అగ్రనేత ప్రియాంక గాంధీ, కర్ణాటక డిప్యూటీ సీఎం శివకుమార్
- 25న రేవంత్‌రెడ్డి, అమిత్‌షా పర్యటన
- 27న తాళ్లపూసపల్లికి ప్రధాని నరేంద్రమోదీ
- 28న వరంగల్ తూర్పు, పశ్చిమలో సీఎం కేసీఆర్



జంగ్ తెలంగాణ

సాక్షిప్రతినిధి, వరంగల్:

ఉమ్మడి వరంగల్‌లో శాసనసభ ఎన్నికల ప్రచారం తారస్థాయికి చేరింది. ఎన్నికలకు మరో ఏడు రోజులే గడువు ఉండగా.. ఐదు రోజుల్లో ప్రచారానికి తెరపడనుంది. దీంతో వివిధ పార్టీల అగ్రనేతలు వస్తుండడంతో ఉమ్మడి జిల్లాలో రాజకీయ సందడి నెలకొంది. ఆపార్టీ శ్రేణుల్లో జోష్ కనిపిస్తోంది. ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో విస్తృతంగా తిరుగుతున్న అభ్యర్థులు.. ఆయా పార్టీల అగ్రనేతల ప్రచారంతో మరింత ఊపు వస్తుందని భావిస్తున్నారు. ప్రధాని నరేంద్రమోదీ, అమిత్‌షా, ఏఐసీసీ అగ్రనేతలు రాహుల్, ప్రియాంకగాంధీ, సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు ప్రచారం నిర్వహించారు. ప్రచారానికి మరో ఐదు రోజుల్లో తెరపడనుంది. ఈనేపథ్యంలో ప్రచారాన్ని హోరెత్తించేందుకు ప్రతిష్ఠాత్మక, చారిత్రాత్మక ఓరుగల్లుకు అగ్రనేతలు మళ్లీ వరుస కడుతున్నారు.

నేడు సీఎం కేసీఆర్, ప్రియాంక.. 27న ప్రధాని మోదీ

సీఎం కేసీఆర్ మరోసారి ప్రజా ఆశీర్వాద సభల్లో పాల్గొనేందుకు శుక్రవారం రానున్నారు. ఈనెల 16న జనగామలో సభ నిర్వహించి ప్రచారానికి శ్రీకారం చుట్టిన ఆయన.. శుక్రవారం ములుగు, భూపాలపల్లి నియోజకవర్గాల్లో నిర్వహించే ప్రజా ఆశీర్వాద సభల్లో పాల్గొననున్నారు. బీఆర్‌ఎస్ అభ్యర్థుల గెలుపు కోసం ప్రచారం నిర్వహించనున్నారు. ఏఐసీసీ అగ్రనేత ప్రియాంకగాంధీ పాలకుర్తి నియోజకవర్గం తొర్రూరులో నిర్వహించే విజయభేరి సభలో పాల్గొని ప్రసంగించనున్నారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తరఫున ప్రచారం నిర్వహించనున్నారు. 24న కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ వర్ధన్నపేట నియోజకవర్గం మడికొండలో నిర్వహించే సభలో పాల్గొంటారు. 25న టీపీసీసీ అధ్యక్షుడు ఎ.రేవంత్‌రెడ్డి భూపాలపల్లిలో నిర్వహించే ప్రచారసభలో ప్రసంగిస్తారు. రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి టి.హరీశ్‌రావు పాలకుర్తిలో ఏర్పాటు చేసిన ప్రజా ఆశీర్వాదసభలో 25న పాల్గొంటారు. 26న కేంద్రమంత్రి అమిత్‌షా ములుగు నియోజకవర్గంతో పాటు పలు చోట్ల బీజేపీ అభ్యర్థుల తరఫున ప్రచారం నిర్వహిస్తారు. 27న ప్రధానమంత్రి నరేంద్రమోదీ మహబూబాబాద్ జిల్లా కేంద్రం శివారులో ఏర్పాటు చేసే సభలో పాల్గొని ప్రసంగించనున్నట్లు బీజేపీ వర్గాలు తెలిపాయి. ఈనెల 28న వరంగల్ తూర్పు, వరంగల్ పశ్చిమ నియోజకవర్గాల్లో నిర్వహించే ప్రజా ఆశీర్వాద సభల్లో సీఎం కేసీఆర్ పాల్గొని ప్రసంగించనున్నారు.

రసకందాయంలో ఓరుగల్లు రాజకీయం

ఆత్మీయ సమ్మేళనాలు, ఇంటింటి ప్రచారాలు, రోడ్‌షోలతో ఉమ్మడి వరంగల్‌లో ఎన్నికల ప్రచారం పతాకస్థాయికి చేరుకుంది. పోలింగ్ కేంద్రాల వారీగా ప్రచార కార్యాచరణ చేపడుతున్న ప్రధాన పార్టీల అభ్యర్థులు.. అగ్రనేతల రోడ్‌షోలకు భారీగా జనాన్ని సమీకరిస్తున్నారు. ఇక ప్రచారానికి మిగిలింది ఐదు రోజులే కావడంతో సుడిగాలి పర్యటనలు చేస్తూ.. ఓటర్లను ఆకర్షిస్తున్నారు. ప్రధాన పార్టీల అగ్రనేతలు ఉమ్మడి జిల్లాల్లో శుక్రవారం నుంచి ప్రచారానికి రానుండడంతో అసెంబ్లీ పోరు ఆద్యంతం రక్తికట్టిస్తోంది. అభ్యర్థులు ఎత్తుకు పైఎత్తులు వేస్తూనే.. విమర్శలు, ప్రతి విమర్శలతో ఓటర్లను తమవైపు తిప్పుకునేందుకు యత్నిస్తుండడంతో ఎన్నికల రాజకీయం రసకందాయంలో పడింది.

'ఈవీఎం'లు జాగ్రత్తగా నిర్వహించండి



ఈవీఎం కమిషనింగ్ ప్రక్రియను పరిశీలిస్తున్న కలెక్టర్ సిక్తాపట్నాయక్



పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య

హన్మకొండ అర్బన్: ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ (ఈవీఎం) కమిషనింగ్ ప్రక్రియను జాగ్రత్తగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సిక్తా పట్నాయక్ అధికారులను ఆదేశించారు. గురువారం ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లలో ఈవీఎంల కమిషనింగ్ ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈవీఎంలపై సీరియల్ నంబర్లు, అభ్యర్థుల పేర్లు, వారికి కేటాయించిన చిహ్నాల ఏర్పాటు సీసీ కెమెరాల ఎదుట పక్కాగా నిర్వహించాలని ఆదేశించారు. స్ట్రాంగ్ రూమ్ నిర్వహణ, తదితర అంశాలను పరకాల, హనుమకొండ ఆర్డీఓలు శ్రీనివాస్, రమేశ్‌ను అడిగి తెలుసుకున్నారు. వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎంల కమిషనింగ్ ప్రక్రియ, పనితీరుపై సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో సెక్టోరియల్ అధికారులు, వివిధ రాజకీయపార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఫెసిలిటేషన్ సెంటర్ పరిశీలన

నయీంనగర్‌లోని చైతన్య డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటర్‌ను కలెక్టర్ సిక్తా పట్నాయక్ గురువారం సందర్శించారు. ఓటింగ్ సరళిపై తీసుకుంటున్న జాగ్రత్తల్ని తెలుసుకున్నారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గానికి సంబంధించి రెండు ఫెసిలిటేషన్ సెంటర్లను ఏర్పాటు చేయగా.. పోస్టల్ బ్యాలెట్ కోసం దరఖాస్తు చేసుకున్న ప్రభుత్వ ఉద్యోగులు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. పలువురు ఓటర్లను కలెక్టర్ పలకరించారు. 28వ తేదీ వరకు రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో పోస్టల్ బ్యాలెట్ ఓట్లు వేయొచ్చని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో డీఈఓ అబ్దుల్ హై, నోడల్ అధికారి సురేశ్, తహసీల్దార్ బావుసింగ్ పాల్గొన్నారు.

పొరపాట్లు లేకుండా చూసుకోవాలి..

ఈనెల 30న జరగనున్న ఎన్నికల్లో ఎలాంటి పొరపాట్లు లేకుండా చూసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. గురువారం నయీంనగర్‌లో సీడీసీలో ఎన్నికల విధుల్లో పాల్గొననున్న ఓపీఓలకు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాన్ని కలెక్టర్ సందర్శించారు. అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు.

సిబ్బంది ఓటు హక్కు వినియోగించుకోవాలి

వరంగల్ అర్బన్: ఎన్నికల విధులు నిర్వర్తించే సిబ్బంది విధిగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని వరంగల్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రావీణ్య సూచించారు. వరంగల్‌లోని ఎల్‌బీ కళాశాలలో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ కేంద్రాన్ని బుధవారం ఆమె సందర్శించి మాట్లాడుతూ.. వరంగల్ తూర్పు, వర్ధన్నపేటలో ఎన్నికల విధులు నిర్వర్తిస్తున్న సిబ్బంది, పీఓలు, ఏపీఓలు, ఓపీఓలు పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకోవడానికి వీలుగా ఫెసిలిటేషన్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో అదనపు రిటర్నింగ్ అధికారి అనిసుర్ రషీద్, డిప్యూటీ కమిషనర్ కృష్ణారెడ్డి, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి ఇక్బాల్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం పంపిణీ నియంత్రణకు చర్యలు

- జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలకుడు రాహుల్
- ఎన్నికల అధికారులతో సమీక్ష



చెక్‌పోస్టును పరిశీలిస్తున్న ఎన్నికల వ్యయ పరిశీలకుడు గావండే

కాజీపేట అర్బన్: ఈనెల 30న జరగనున్న అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా మద్యం పంపిణీ నియంత్రణకు అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలకుడు రాహుల్ పంజాబ్రావ్ గావండే ఆదేశాలు జారీ చేశారు. నిట్ క్యాంపస్‌లో గురువారం ఎన్నికల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఇందులో ఆయన మాట్లాడుతూ ఎన్నికలను నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. రూ.40 లక్షల ఖర్చు మించకూడదని అభ్యర్థులకు అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. ఓటర్లను ప్రలోభపెట్టే వారిపై చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీసీఓ నాగేశ్వర్‌రావు, ఎక్సైజ్ సూపరింటెండెంట్ చంద్రశేఖర్, ఐటీ శాఖ ఆఫీసర్ చక్రధర్ తదితరులు పాల్గొన్నారు.

వాహనాల్ని క్షుణ్ణంగా తనిఖీ చేయండి

హన్మకొండ అర్బన్: ఎన్నికల సందర్భంగా చెక్‌పోస్టుల వద్ద వాహనాల్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, పోలీస్ వాహనాలతో సహా అన్ని ప్రభుత్వ శాఖలకు చెందిన వాహనాల్ని తనిఖీ చేయాలని జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలకుడు రాహుల్ పంజాబ్‌రావు గావండే అధికారులను ఆదేశించారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గ పరిధి కాజీపేట, డీజిల్ కాలనీ, సీఎస్ఆర్ గార్డెన్ వద్ద ఏర్పాటు చేసిన చెక్ పోస్టులను ఆయన గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.

'కోడ్'లో కల్యాణాలు

- పెళ్లి సామగ్రి తరలింపునకు తప్పని తిప్పలు
- శుభకార్యాలకు హాజరవుతున్న అభ్యర్థులు
- ఓట్లు రాబట్టుకోవాలని ప్రయత్నాలు



ఖిలా వరంగల్: కల్యాణ తంతుకు ప్రస్తుతం ఎన్నికల కోడ్ పరీక్ష పెడుతోంది. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా ప్రధాన రహదారులు, నగరంలోకి ప్రవేశించే ప్రధాన కూడళ్లపై పోలీసులు చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. నగదు తరలించకుండా పకడ్బందీగా తనిఖీలు చేస్తున్నారు. రూ.50 వేలకు మించి నగదు తీసుకెళ్లాలంటే ఇబ్బందికర పరిస్థితి నెలకొంది. కట్నకానుకాల మాట దేవుడెరుగు కనీసం వధువరులతోపాటు బంధువులకు చీరలు కూడా ఒకేసారి తీసుకెళ్లడానికి కోడ్ అడ్డు పడుతోంది. పెళ్లిళ్లకు నగలు, వస్త్రాలు భారీ ఎత్తున కొనుగోలు చేస్తుంటారు. వంట తయారు చేసే వారికి, కల్యాణ వేదికలపై డెకరేషన్స్, ఈవెంట్ నిర్వాహకులకు డబ్బులిచ్చేందుకు ఇబ్బందులు తప్పడం లేదు. నిర్వాహకులు దూర ప్రాంతాలకు వెళ్లి అవసరమైన సామగ్రి కొనేందుకు ఇక్కట్లు పడుతున్నారు. సరైన ఆధారాలు చూపకుంటే పట్టుబడిన నగదు వెంటనే చేతికి రావట్లేదు. శుభకార్యాలు చేసుకుంటున్న ఇళ్లలో పరిస్థితి దయనీయంగా మారిందని కొందరు వాపోతున్నారు.

అభ్యర్థుల గురి..

నవంబర్ 23 నుంచి డిసెంబర్ 15 వరకు ముహూర్తాలున్నాయి. ఈ తేదీల్లో జోరుగా శుభకార్యాలు జరగనున్నాయి. ఎలక్షన్ కోడ్ నేపథ్యంలో శుభకార్యాలు జరిపేవారికి అడుగడుగునా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కాగా.. ఇదే అదనుగా అభ్యర్థులు ప్రచారం కొనసాగిస్తున్నారు. కాస్త పరిచయముండి పిలిస్తే చాలు.. ఆయా శుభకార్యాలకు హాజరవుతున్నారు. అక్కడ సైతం నేను మీ వాడినే అంటూ అండగా నిలవాలని అభ్యర్థిస్తున్నారు. గురువారం నుంచి ఈనెల 29 తేదీ వరకు జరగనున్న వివాహాలకు అభ్యర్థులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదిస్తూ బంధుమిత్రులను కలిసే పనిలో నిమగ్నమయ్యారు.

'తూర్పు'లో దూషణల పర్వం

- కాంగ్రెస్ వర్సెస్ బీఆర్‌ఎస్
- నువ్వు డబ్బులు తిన్నావంటే.. నువ్వు తిన్నావని ఆరోపణలు
- అవాక్కవుతున్న నగరవాసులు



వరంగల్: వరంగల్ తూర్పులో దూషణల పర్వం కొనసాగుతోంది. బుధవారం తూర్పులోని కాశిబుగ్గలో బీఆర్‌ఎస్ భారీ ర్యాలీ నిర్వహించగా.. కాంగ్రెస్ పార్టీ సైతం సాయంత్రం పోటీగా భారీ ర్యాలీ నిర్వహించింది. ఈర్యాలీ అనంతరం జరిగిన సభల్లో ఇరు పార్టీలకు చెందిన నేతలు పరస్పరం వ్యక్తిగత దూషణలకు దిగడంతో ప్రచారంలో పాల్గొన్న కార్యకర్తలు ఒక్కసారిగా అవాక్కయ్యారు.

ఏమిటీ దూషణలు..

'ఒక డి.. గాని వద్ద మరో డి...గాడు చేరాడు. వీరిద్దరి సంగతి తేలుస్తా. కాశిబుగ్గ ప్రాంతంలో వీరు చేసిన కబ్జాలు, సిండికేట్ వ్యవహారం బయటపెడతా. కొడుకులు నకరాలు చేస్తున్నారు. కాశిబుగ్గ చౌరస్తాలో బట్టలూడదీస్తా..' అంటూ బీఆర్‌ఎస్ అభ్యర్థి నరేందర్ దూషణకు దిగాడు. దీనిపై కాంగ్రెస్ పార్టీ నాయకుడు గుండేటి నరేంద్రకుమార్ స్పందిస్తూ.. 'పాత ఇనుప సామాన్లు కొంటాం. అన్నట్లుగా ఎమ్మెల్యే నరేందర్ నాయకుల్ని కొనుగోలు చేస్తున్నారు. ఒళ్లు దగ్గర పెట్టుకుని మాట్లాడాలి. కార్పొరేషన్ ఎన్నికల సమయంలో పార్టీ నుంచి వచ్చిన ఫండ్‌ను కాజేశావు. నాకు వచ్చిన డబ్బులు నువ్వే తీసుకున్నావా లేదా చెప్పు? కార్పొరేటర్ల టికెట్లు అమ్ముకున్నావు. ఎవరి దగ్గర ఎన్ని పైసలు వసూలు చేశావో చెప్పాలా? నేను అవినీతి చేశానంటావా?' అంటూ విరుచుకుపడ్డాడు. వీరి తీరు చూసి ఒకదశలో తూర్పు నియోజకవర్గవాసులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

తమ పని తాము చేసుకుంటూ పోతున్న బీజేపీ శ్రేణులు

బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీ నేతలు బహిరంగంగా ఒకరిపై ఒకరు ఆరోపణలు, తిట్ల దండకం చేస్తుండగా.. బీజేపీ అభ్యర్థి ప్రదీప్‌రావు మాత్రం ప్రచారంలో తలమునకలవుతున్నారు. నేతలు నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటిస్తూ.. చాప కింద నీరులా ప్రశాంతంగా తమ పని తాము చేసుకుపోతున్నారని చర్చ సాగుతోంది. బీజేపీ అభ్యర్థి తరఫున ఆయన కుటుంబ సభ్యులు ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్నారని, వాణిజ్య, వ్యాపార వర్గాలకు చెందిన పలువురు బయట పడకుండా ప్రదీప్‌రావు వైపు మొగ్గుచూపుతున్నారన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

సమస్యాత్మక కేంద్రాల వద్ద పటిష్ట చర్యలు



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కేంద్ర పోలీస్ ఎన్నికల పరిశీలకుడు రాజేశ్‌కుమార్

వరంగల్ అర్బన్: సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద పోలింగ్ ప్రశాంతంగా జరిగేందుకు పటిష్ఠ చర్యలు తీసుకోవాలని కేంద్ర ఎన్నికల పోలీస్ పరిశీలకుడు రాజేశ్‌కుమార్ అన్నారు. వరంగల్ తూర్పు నియోజకవర్గ పరిధిలో గుర్తించిన సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గురువారం ఆయన పరిశీలించి ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈసందర్భంగా సీకేఎం కళాశాల, ఎస్‌పీఆర్ నగర్ పాఠశాల, ఎల్‌బీనగర్‌లోని అల్ నూరు పాఠశాల, చార్‌బౌలిలోని ప్రభుత్వ పాఠశాలలోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. రాజేశ్‌కుమార్ మాట్లాడుతూ.. వరంగల్ తూర్పులో గుర్తించిన 57 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల సంఘం నిబంధనల మేరకు అదనపు బలగాల మోహరింపు, లైవ్ వెబ్‌కాస్టింగ్, సూక్ష్మ పరిశీలకులు ఉండాలని, పోలింగ్ సజావుగా జరగాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ బోనాల కిషన్, సర్కిల్ ఎస్‌ఐ సురేశ్‌గౌడ్‌తో పాటు పోలీస్ పరిశీలకులు లైజన్ ఆఫీసర్ నిస్సార్ పాషా తదితరులు పాల్గొన్నారు.

96.64 శాతం హోం ఓటింగ్



హోం ఓటింగ్ నిర్వహిస్తున్న అధికారులు



బ్యాలెట్ ఓటు వేసిన సిద్ధమ్మ

హన్మకొండ అర్బన్: హనుమకొండ జిల్లాలోని వరంగల్ పశ్చిమ, పరకాల నియోజకవర్గాల్లో ఈనెల 21న ప్రారంభమైన హోం ఓటింగ్ మూడో రోజు గురువారం ప్రశాంతంగా ముగిసింది. హోం ఓటింగ్‌లో వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో 353 మంది ఓటర్లు ఉండగా.. 336 మంది ఓటర్లు (95.18 శాతం), పరకాలలో 302 మందికిగాను 297 మంది (98.34 శాతం) తమ ఓటు హక్కును వినియోగించుకున్నట్లు అధికారులు తెలిపారు. జిల్లాలో మొత్తం 655 మంది ఓటర్లకుగాను 633 మంది (96.64శాతం) మంది హోం ఓటింగ్ ద్వారా తమ ఓటును వినియోగించుకున్నారని తెలిపారు.

తూర్పులో మొదటి బ్యాలెట్ ఓటు

వరంగల్: వరంగల్ తూర్పు నియోజకవర్గంలో మొదటి బ్యాలెట్ ఓటు నమోదైంది. గురువారం కొత్తవాడ తుమ్మలకుంటలోని 84 ఏళ్ల సిద్ధమ్మ ఓటు హక్కును వినియోగించుకున్నట్లు పోలింగ్ అధికారులు తెలిపారు.

జిల్లాలో తేలికపాటి వర్షం

హన్మకొండ: వాతావరణంలో మార్పులు చోటుచేసుకోవడంతో హనుమకొండ జిల్లాలో గురువారం ఆకాశం మేఘావృతమైంది. తేలికపాటి వర్షం కురిసింది. రోజంతా ఆకాశం మబ్బులతో కమ్ముకుని.. కొన్ని ప్రాంతాల్లో చిరు జల్లులు కురిశాయి. మరో రెండ్రోజుల పాటు తేలిక పాటి వర్షాలు కురిసి, చినుకులు పడే అవకాశముందని వాతావరణ శాఖ తెలిపింది. ఆత్మకూరులో 16 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. హసన్‌పర్తి 13.5, హసన్‌పర్తి నాగారం 6.3, ఐనవోలులో 4.8, దామెర 4.8, శాయంపేట 4.5, వేలేరు 4, భీమదేవరపల్లి 3.5, ఎల్కతుర్తిలో 2.5 మిల్లీమీటర్ల వర్షం కురిసింది.

సాక్షి బిజినెస్

శుక్రవారం
24-11-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	5	66,018
నిఫ్టీ ▽	10	19,802

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)			
నాస్‌డాక్	14,266	△	66
డోజోన్స్	35,273	▽	185
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,484	△	14
డాక్స్	15,995	△	37
షాంఘై	3,062	△	18
నికాయ్	33,452	△	98

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై		
బంగారం (99.9 స్వచ్ఛత)		
61,394	▽	222
బంగారం (99.5 స్వచ్ఛత)		
61,148	▽	221
వెండి (కిలో)		
73,065	▽	400

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బిఐ	82.53	84.20
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బిఐ	102.55	105.90
€	యూరో	ఎస్‌బిఐ	89.35	92.43
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బిఐ	62.71	64.78
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బిఐ	53.43	55.78
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బిఐ	61.81	63.86
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.27	22.89
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.79	23.59
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.55	12.62

ఏటా 10 శాతం చొప్పున జీవితాంతం

- డిసెంబర్‌లో ఎల్‌ఐసీ కొత్త ప్లాన్
- మూడు–నాలుగు కొత్త పాలసీలకు ప్రణాళికలు



న్యూఢిల్లీ: జీవిత బీమా రంగ దిగ్గజం ఎల్‌ఐసీ ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మూడు నుంచి నాలుగు వరకు నూతన పాలసీలను ఆవిష్కరించనుంది. నూతన వ్యాపార ప్రీమియంలో రెండంకెల వృద్ధిని సాధించాలనే లక్ష్యంతో ఉంది. ''గతేడాదితో పోలిస్తే రెండంకెల వృద్ధిని సాధిస్తాం. ఎందుకంటే ఇండివిద్యువల్ రిటైల్ వ్యాపారం పుంజుకుంటున్న సంకేతాలు కనిపిస్తున్నాయి. ఆకర్షణీయమైన కొత్త పాలసీలను ఆవిష్కరించనున్నాం''అని ఎల్‌ఐసీ చైర్మన్ సిద్ధార్థ మహంతి తెలిపారు. డిసెంబర్ మొదటి వారంలో ఎల్‌ఐసీ ఒక ఉత్పత్తిని తీసుకువస్తుందని వెల్లడించారు. దీనితో మార్కెట్లో మంచి స్పందన వస్తుందని ఆశిస్తున్నట్టు చెప్పారు. డిసెంబర్‌లో తెచ్చే నూతన పాలసీ గురించి వివరిస్తూ.. పాలసీ మెచ్యూరిటీ తర్వాత (గడువు ముగిసిన అనంతరం) జీవితాంతం ఏటా సమ్ అష్యూర్డ్‌లో (బీమా కవరేజీలో) 10 శాతం చొప్పున లభిస్తుందని తెలిపారు. ఇది మార్కెట్లో సంచలనాన్ని సృష్టిస్తుందన్నారు. 20–25 ఏళ్ల తర్వాత ఎంత చొప్పున వస్తుంది, ఎంత ప్రీమియం చెల్లించాలన్నది తెలుసుకునేందుకు ప్రతి ఒక్కరూ ఆసక్తి చూపిస్తారని పేర్కొన్నారు. ఈ ప్లాన్‌పై రుణ సదుపాయం, ముందస్తు ఉపసంహరణకూ అవకాశం ఉంటుందన్నారు. హామీతో కూడిన రాబడులు ఇచ్చే పాలసీలకు పాలసీదారులు, వాటాదారులు ఆసక్తి చూపిస్తున్నారని చెబుతూ.. తమ కంపెనీ వాటాదారుల్లో చాలా మంది పాలసీదారులుగా ఉన్నట్టు మహంతి తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి ఆరు నెలల్లో (ఏప్రిల్–సెప్టెంబర్) నూతన వ్యాపార ప్రీమియం (ఇండివిద్యువల్) 2.65 శాతమే వృద్ధి చెంది రూ.25,184 కోట్లకు చేరుకోవడం గమనార్హం.

అమెజాన్‌తో వాణిజ్య శాఖ ఒప్పందం

చిన్న సంస్థలకు ఎగుమతులపై శిక్షణ



న్యూఢిల్లీ: దేశీయంగా 20 జిల్లాల్లోని చిన్న, మధ్య తరహా సంస్థలకు (ఎంఎస్‌ఎంఈ) శిక్షణ కల్పించే దిశగా ఈ–కామర్స్ దిగ్గజం అమెజాన్‌తో అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదుర్చుకున్నట్లు కేంద్ర వాణిజ్య శాఖ వెల్లడించింది. దీని ప్రకారం ఈ–కామర్స్ మాధ్యమం ద్వారా ఎగుమతులను ప్రోత్సహించే దిశగా ఇమేజింగ్, డిజిటల్ క్యాటలాగ్‌లను రూపొందించడం, పన్నుల సంబంధమైన అంశాలను తెలుసుకోవడం మొదలైన వాటికి ఈ శిక్షణ ఉపయోగపడగలదని పేర్కొంది. ఎగుమతుల హబ్‌లుగా గుర్తించిన జిల్లాల్లో అమెజాన్, డీజీఎఫ్‌టీ కలిసి శిక్షణ, వర్క్‌షాప్‌లను నిర్వహిస్తాయి. ఇతర జిల్లాల్లోనూ ఇదే తరహా కార్యక్రమాల కోసం ఫ్లిప్‌కార్ట్, ఈబే, రివెక్సా, షిప్‌రాకెట్, షాప్‌క్లూస్ వంటి వివిధ ఈ–కామర్స్ సంస్థలతో డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ (డీజీఎఫ్‌టీ) చర్చలు జరుపుతున్నట్లు వాణిజ్య శాఖ ఒక ప్రకటనలో వివరించింది. ఈ–కామర్స్ ప్లాట్‌ఫామ్‌ల ద్వారా దేశీ సంస్థలు అంతర్జాతీయంగా మరిన్ని ఎగుమతి అవకాశాలను అందిపుచ్చుకునేందుకు ఈ ఒప్పందాలు ఉపయోగపడతాయి. 2030 నాటికి ఈ–కామర్స్ ద్వారా 350 బిలియన్ డాలర్ల విలువ చేసే ఉత్పత్తులను ఎగుమతి చేయాలని భారత్ లక్ష్యంగా నిర్దేశించుకోవాలని గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ ఇనీషియేటివ్ (జీటీఆర్‌ఐ) ఇటీవల ఒక నివేదికలో పేర్కొంది. ప్రస్తుతం ఇవి 2 బిలియన్ డాలర్లుగా మాత్రమే ఉన్నాయి. ఎగుమతులను సరళతరం చేయడం, 2025 నాటికి ఈ–కామర్స్ ఎగుమతులను 20 బిలియన్ డాలర్లకు చేర్చడంపై ప్రధానంగా దృష్టి పెట్టనున్నట్లు అమెజాన్ ఇండియా డైరెక్టర్ భూపేన్ వాకంకర్ తెలిపారు.

ఇరెడా ఐపీవో సక్సెస్



చివరి రోజుకల్లా 39 రెట్లు అధిక బిడ్స్

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ మినీరత్న సంస్థ ఇండియన్ రెనెవబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ ఏజెన్సీ(ఐఆర్‌ఈడీఏ–ఇరెడా) పబ్లిక్ ఇష్యూ విజయవంతమైంది. చివరి రోజు గురువారానికల్లా 39 రెట్లు అధిక స్పందన నమోదైంది. కంపెనీ 47 కోట్లకుపైగా షేర్లను ఆఫర్ చేయగా.. 1,827 కోట్లకుపైగా షేర్ల కోసం దరఖాస్తులు దాఖలయ్యాయి. సంస్థాగతేతర ఇన్వెస్టర్ల నుంచి 24 రెట్లు, రిటైలర్ల నుంచి దాదాపు 8 రెట్లు అధికంగా బిడ్స్ లభించాయి. అర్హతగల కొనుగోలుదారుల(క్విబ్) విభాగంలో అయితే దాదాపు 105 రెట్లు అధికంగా దరఖాస్తులు వెల్లువెత్తాయి. రూ. 30–32 ధరల శ్రేణిలో చేపట్టిన ఇష్యూలో భాగంగా సోమవారం(20న) యాంకర్ ఇన్వెస్టర్ల నుంచి రూ. 643 కోట్లు సమీకరించిన సంగతి తెలిసిందే.

ఈక్విటీ వివరాలిలా

ఐపీవోలో భాగంగా 40.31 కోట్ల ఈక్విటీ షేర్లను ఇరెడా తాజాగా జారీ చేయనుంది. అంతేకాకుండా కంపెనీ ప్రమోటర్ కేంద్ర ప్రభుత్వం 26.88 కోట్ల షేర్లను విక్రయానికి ఉంచింది. ఈక్విటీ జారీతో రూ. 1,290 కోట్లు, ప్రభుత్వ వాటాకు రూ. 860 కోట్ల చొప్పున లభించనున్నాయి. వెరసి ఇష్యూ ద్వారా కంపెనీ మొత్తం రూ. 2,150 కోట్లు సమకూర్చుకోనుంది. గతేడాది మే నెలలో బీమా రంగ దిగ్గజం ఎల్‌ఐసీ లిస్టింగ్ తదుపరి మళ్లీ ప్రభుత్వ రంగ సంస్థ పబ్లిక్ ఇష్యూకి రావడం విశేషం! కాగా.. ఈక్విటీ జారీ నిధులను కంపెనీ భవిష్యత్ పెట్టుబడి అవసరాలరీత్యా మూలధన పటిష్టతకు వినియోగించనుంది.

ప్యూర్ ఈవీ నుంచి ఎకోడ్రిఫ్ట్ బైక్

ధర రూ. 1,29,999



హైదరాబాద్: ఎలక్ట్రిక్ వాహనాల సంస్థ ప్యూర్ ఈవీ తమ కొత్త మోటార్ సైకిల్ వేరియంట్ ఎకోడ్రిఫ్ట్ 350ని ఆవిష్కరించింది. దీన్ని ఒక్కసారి చార్జి చేస్తే 171 కి.మీ. వరకు ప్రయాణించగలదు. ప్రతి రోజూ ఎక్కువ దూరాలు ప్రయాణించే వినియోగదారులకు ఇది ఎంతో అనువుగా ఉంటుందని సంస్థ తెలిపింది. దీనితో నెలవారీగా రూ. 7,000 పైబడి లుకు ఆదా కాగలదని వివరించింది. దీని ధర రూ. 1,29,999గా ఉంటుందని ప్యూర్ సహ వ్యవస్థాపకుడు రోహిత్ వదేరా తెలిపారు. సులభతరమైన ఈఎంఐ సదుపాయం రూ. 4,000 నుంచి ఉంటుందని పేర్కొన్నారు. 110 సీసీ సెగ్మెంట్‌లో హీరో స్ప్లెండర్, హోండా షైన్, బజాజ్ ప్లాటినా వంటి మోటార్‌సైకిల్స్‌తో దీటుగా పోటీపడగలిగేలా దీన్ని తీర్చిదిద్దినట్లు వివరించారు. ఇందులో రివర్స్ మోడ్, హిల్ స్టార్ట్ అసిస్ట్, డౌన్ హిల్ అసిస్ట్ వంటి ఫీచర్లు కూడా ఉన్నాయి. 75 కి.మీ. గరిష్ఠ వేగంతో ప్రయాణించగలదు.

ఫేమ్ ఉల్లంఘనలపై విచారణ

నెల రోజుల్లో నివేదిక; తర్వాత చర్యలు



న్యూఢిల్లీ: ఫేమ్–2 స్కీము నిబంధనల ఉల్లంఘనలో అధికారులపరంగా తప్పిదాలు జరిగాయన్న ఆరోపణలపైనా కేంద్రం దృష్టి పెట్టింది. వాటితో పాటు వేలిడేషన్, టెస్టింగ్ ఏజెన్సీలైన ఆటోమోటివ్ రీసెర్చ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఏఆర్‌ఏఐ), ఇంటర్నేషనల్ సెంటర్ ఫర్ ఆటోమోటివ్ టెక్నాలజీ (ఐసీఏటీ) అధికారుల పాత్రపైనా కేంద్ర భారీ పరిశ్రమల శాఖ విచారణ ప్రారంభించింది. దీనికి సంబంధించి నెల రోజుల వ్యవధిలో నివేదిక రావచ్చని శాఖ కార్యదర్శి కమ్రాన్ రిజ్వి తెలిపారు. ఆ తర్వాత ఉల్లంఘనలకు బాధ్యులైన వారితో పాటు సిస్టమ్స్‌ను కూడా సరిదిద్దే చర్యలు ఉంటాయని పేర్కొన్నారు. స్థానికంగా తయారీని, విద్యుత్ వాహనాల వినియోగాన్ని ప్రోత్సహించేందుకు.. ఎలక్ట్రిక్ వాహనాల తయారీ సంస్థలకు సబ్సిడీలు ఇచ్చేలా కేంద్రం రూ. 10,000 కోట్లతో ఫేమ్–2 స్కీమును ప్రవేశపెట్టింది. అయితే, నిబంధనలకు విరుద్ధంగా పలు కంపెనీలు పెద్ద స్థాయిలో దిగుమతి చేసుకుంటున్నాయని, ఏడు సంస్థలు నిబంధనలకు విరుద్ధంగా ప్రోత్సాహకాలు పొందాయని ఆరోపణలొచ్చాయి.

ఆచితూచి రుణాలివ్వండి..!

- ఎన్‌బీఎఫ్‌సీలకు కేంద్ర ఆర్థిక మంత్రి సూచన
- అత్యుత్సాహం ప్రదర్శించొద్దని హితవు

న్యూఢిల్లీ: ఆర్‌బీఐ సూచించిన విధంగా బ్యాంకింగేతర ఆర్థిక సంస్థలు, స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్‌లు రుణ వితరణలో అప్రమత్తంగా వ్యవహరించాలని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సూచించారు. ఎర్రటి గీతను (హద్దులను/పరిమితులను) గౌరవించాలని, అత్యుత్సాహంతో దూకుడుగా వ్యవహరించరాదని కోరారు. వ్యక్తిగత రుణాలు, క్రెడిట్‌కార్డ్ రుణ విభాగంలో (అన్‌సెక్యూర్డ్) బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలు గడిచిన కొన్నేళ్లలో భారీ వృద్ధిని చూపిస్తుండడం తెలిసిందే. ఫలితంగా ఈ విభాగంలో ఎన్‌పీఏలు క్రమంగా పెరుగుతున్నాయి. దీంతో రిస్క్ నియంత్రణకు గాను ఆర్‌బీఐ ఇటీవలే నిబంధనలు కఠినతరం చేయడం తెలిసే ఉంటుంది. వ్యక్తిగత రుణాలు, క్రెడిట్ కార్డుల రుణాలకు గాను రిస్క్ వెయిటేజీని 0.25 శాతం మేర పెంచింది. దీనివల్ల బ్యాంకుల వరకే రూ.84,000 కోట్లను అదనంగా పక్కన పెట్టాల్సి రావచ్చని అంచనా. 'డేట్ విత్ టెక్' కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా మంత్రి సీతారామన్ ఈ అంశాన్ని ప్రస్తావించారు. ''ఉత్సాహం మంచిదే. కానీ, కొన్ని సందర్భాల్లో ఇదీ మరీ ఎక్కువైతే జీర్ణించుకోవడం కష్టం. దీంతో జాగ్రత్తగా ఉండాలని, దూకుడుగా వ్యవహరించడం ద్వారా తర్వాత రిస్క్‌లు చవిచూడొద్దన్న ఉద్దేశంతోనే ఆర్‌బీఐ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్‌లు, ఎన్‌బీఎఫ్‌సీలను అప్రమత్తం చేసింది'' అని మంత్రి సీతారామన్ వివరించారు.



డేటా సురక్షితం

అకౌంట్ అగ్రిగేటర్లతో (ఏఏ) పంచుకునే కస్టమర్ల డేటా దేశంలో పూర్తి సురక్షితంగా ఉంటుందని మంత్రి సీతారామన్ హామీనిచ్చారు. డేటా భద్రత విషయంలో వ్యక్తమవుతున్న ఆందోళనను తొలగించే ప్రయత్నం చేశారు. ''అకౌంట్ అగ్రిగేటర్లు డేటా బ్యాంక్ కలిగి ఉంటారనే అభిప్రాయాలు ఉండేవి. నిజానికి వారు డేటా కలిగి ఉండరు. వారి ద్వారా డేటా బదిలీ అవుతుంది. ఏఏ ద్వారా బ్యాంక్ కానీ, కస్టమర్ కానీ డేటా కలిగి ఉండరు. కేవలం రుణాల మంజూరీకే దీన్ని వినియోగించుకుంటారు''అని మంత్రి చెప్పారు.

ఆరంభ లాభాలు ఆవిరి..



ముంబై: ట్రేడింగ్‌లో తీవ్ర ఒడిదుడుకులకు లోనైన స్టాక్ సూచీలు గురువారం చివరికి స్వల్ప నష్టాలతో ముగిశాయి. సెన్సెక్స్ 5 పాయింట్లు నష్టపోయి 66,018 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 10 పాయింట్లు పతనమై 19,802 వద్ద నిలిచింది. ఫార్మా, ఐటీ, కన్జూమర్ డ్యూరబుల్స్ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. ఉదయం సానుకూలంగా మొదలైన సూచీలు ఆరంభ లాభాలను నిలుపుకోవడంలో విఫలమయ్యాయి. ట్రేడింగ్ ఆద్యంతం పరిమిత శ్రేణిలో తీవ్ర ఒడిదుడుకులకు లోనయ్యాయి. ఇంధన, రియల్టీ, టెలికం, మెటల్ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో బీఎస్‌ఈ మిడ్, స్మాల్ క్యాప్ సూచీలు అరశాతం చొప్పున రాణించాయి. అంతర్జాతీయ ఈక్విటీ మార్కెట్లు మిశ్రమంగా ట్రేడవుతున్నాయి. ''నిఫ్టీ 19,800 స్థాయిని దాటి ముందుకెళ్లేందుకు ప్రోత్సాహానిచ్చే కీలక పరిణామాలేవీ లేకపోవడంతో పరిమిత శ్రేణి ట్రేడింగ్ రెండోరోజూ కొనసాగింది. క్రూడాయిల్ ధరలు, బాండ్లపై రాబడులు దిగిరావడం వంటి అంశాలు దేశీయ మార్కెట్ పతనాన్ని అడ్డుకుంటున్నాయి'' అని జియోజిత్ ఫైనాన్షియల్ రీసెర్చ్ హెడ్ వినోద్ నాయర్ తెలిపారు.

సాక్షి స్పోర్ట్స్



క్వార్టర్ ఫైనల్లో రష్మిక

మహిళల ప్రపంచ టెన్నిస్ టూర్ టోర్నీలో హైదరాబాద్ అమ్మాయి భమిడిపాటి శ్రీవల్లి రష్మిక సింగిల్స్‌లో క్వార్టర్ ఫైనల్లోకి... డబుల్స్‌లో సెమీఫైనల్లోకి ప్రవేశించింది. బెంగళూరులో జరుగుతున్న ఈ టోర్నీలో గురువారం జరిగిన సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో 21 ఏళ్ల రష్మిక 4–6, 7–5, 7–5తో నాలుగో సీడ్ వైదేహి (గుజరాత్)ను ఓడించింది. 2 గంటల 53 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో రష్మిక నాలుగు ఏస్‌లు సంధించింది. ప్రత్యర్థి సర్వీస్‌ను ఐదుసార్లు బ్రేక్ చేసిన రష్మిక తన సర్వీస్‌ను నాలుగుసార్లు కోల్పోయింది. డబుల్స్ క్వార్టర్ ఫైనల్లో రష్మిక–వైదేహి (భారత్) జోడీ 6–0, 6–3తో కశిష్ భాటియా–వన్షిత (భారత్) జంటపై నెగ్గింది. హైదరాబాద్‌కే చెందిన యడ్లపల్లి ప్రాంజల పోరాటం ఈ టోర్నీలో ముగిసింది. సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో ప్రాంజల 4–6, 3–6తో రుతుజా భోస్లే (భారత్) చేతిలో ఓడిపోయింది.

ప్రణయ్ ముందంజ



షెన్‌జెన్: చైనా మాస్టర్స్ వరల్డ్ టూర్ సూపర్–750 బ్యాడ్మింటన్ టోర్నీ పురుషుల సింగిల్స్‌లో భారత నంబర్‌వన్ హెచ్‌ఎస్ ప్రణయ్ క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లాడు. ప్రిక్వార్టర్ ఫైనల్లో ప్రణయ్ 21–12, 21–18తో మాగ్నస్ జొనాసెన్ (డెన్మార్క్)పై గెలుపొందాడు. మరోవైపు పురుషుల డబుల్స్ విభాగంలో సాత్విక్ సాయిరాజ్–చిరాగ్ శెట్టి (భారత్) ద్వయం కూడా క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది. ప్రిక్వార్టర్ ఫైనల్లో సాత్విక్–చిరాగ్ జోడీ 21–15, 21–16తో అకీరా కొగా–తైచి సైటో (జపాన్) జంటపై గెలిచింది.

రన్నరప్ హారిక



సాక్షి, హైదరాబాద్: జూలియస్ బేర్ అంతర్జాతీయ మహిళల ఆన్‌లైన్ స్పీడ్ చెస్ చాంపియన్‌షిప్‌లో హైదరాబాద్ గ్రాండ్ మాస్టర్ ద్రోణవల్లి హారిక రన్నరప్‌గా నిలిచింది. చైనా గ్రాండ్‌మాస్టర్ హు ఇఫాన్‌తో జరిగిన ఫైనల్లో హారిక 11–15 పాయింట్ల తేడాతో ఓడిపోయింది. విజేతగా నిలిచిన హు ఇఫాన్‌కు 15,769 డాలర్లు (రూ. 13 లక్షల 13 వేలు), రన్నరప్ హారికకు 4,230 డాలర్లు (రూ. 3 లక్షల 52 వేలు) ప్రైజ్‌మనీగా లభించాయి.

ఐపీఎల్‌కు స్టోక్స్ దూరం



చెన్నై: ఇంగ్లండ్ స్టార్ ఆల్‌రౌండర్, చెన్నై సూపర్ కింగ్స్ జట్టు సభ్యుడు బెన్ స్టోక్స్ వచ్చే ఏడాది ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) నుంచి వైదొలిగాడు. పనిభారాన్ని తగ్గించుకోవడానికి స్టోక్స్ ఈ నిర్ణయం తీసుకున్నాడు. వచ్చే ఏడాది ఐపీఎల్ కంటే ముందు భారత జట్టుతో ఇంగ్లండ్ ఐదు టెస్టుల సిరీస్ ఆడనుంది. ఆ తర్వాత జూన్‌లో టి20 వరల్డ్‌కప్ ఉంది. ఈ నేపథ్యంలో పూర్తి ఫిట్‌గా ఉండాలనే ఉద్దేశంతో స్టోక్స్ ఐపీఎల్ నుంచి తప్పుకున్నాడు. స్టోక్స్‌ను చెన్నై ఫ్రాంచైజీ రూ. 16 కోట్ల 25 లక్షలకు తీసుకోగా అతను ఈ ఐపీఎల్ సీజన్‌లో కేవలం రెండు మ్యాచ్‌లు ఆడి మోకాలి గాయంతో మిగతా టోర్నీకి దూరమయ్యాడు.

ఆఖరి బంతికి గట్టెక్కాం

- ఉత్కంఠపోరులో భారత్ విజయం
- కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడిన సూర్యకుమార్
- రాణించిన ఇషాన్, రింకూ సింగ్
- తొలి టి20 మ్యాచ్‌లో ఆస్ట్రేలియా ఓటమి
- ఇన్‌గ్లిస్ సెంచరీ వృథా
- 26న రెండో టి20 మ్యాచ్

సాక్షి, విశాఖపట్నం: పరుగుల వరద పారిన మ్యాచ్‌లో చివరికి భారత జట్టుదే పైచేయిగా నిలిచింది. ఆస్ట్రేలియాతో ఐదు మ్యాచ్‌ల టి20 సిరీస్‌లో టీమిండియా శుభారంభం చేసింది. గురువారం ఇక్కడి డాక్టర్ వైఎస్‌ఆర్–ఏసీఏ–వీడీసీఏ స్టేడియంలో జరిగిన తొలి టి20 మ్యాచ్‌లో సూర్యకుమార్ యాదవ్ నాయకత్వంలోని భారత జట్టు రెండు వికెట్ల తేడాతో ఆస్ట్రేలియా జట్టును ఓడించింది. తొలిసారి జాతీయ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించిన మ్యాచ్‌లో సూర్యకుమార్ టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకోగా... మొదట బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 3 వికెట్లకు 208 పరుగులు సాధించింది. జోష్ ఇంగ్లిస్ (50 బంతుల్లో 110; 11 ఫోర్లు, 8 సిక్స్‌లు) అంతర్జాతీయ కెరీర్‌లో తొలి సెంచరీ సాధించగా... ఓపెనర్‌గా వచ్చిన స్టీవ్ స్మిత్ (41 బంతుల్లో 52; 8 ఫోర్లు) అర్ధ సెంచరీ చేశాడు. వీరిద్దరు మూడో వికెట్‌కు 130 పరుగులు జోడించారు. ఇన్‌గ్లిస్ 47 బంతుల్లో సెంచరీ చేశాడు. ఈ క్రమంలో ఆస్ట్రేలియా తరఫున టి20ల్లో వేగవంతమైన సెంచరీ చేసిన ప్లేయర్‌గా ఆరోన్ ఫించ్ (47 బంతుల్లో) పేరిట ఉన్న రికార్డును సమం చేశాడు. అనంతరం భారత జట్టు 19.5 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 209 పరుగులు చేసి గెలిచింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ (42 బంతుల్లో 80; 9 ఫోర్లు, 4 సిక్స్‌లు), ఇషాన్ కిషన్ (39 బంతుల్లో 58; 2 ఫోర్లు, 5 సిక్స్‌లు)– అర్ధ సెంచరీలతో అదరగొట్టగా... రింకూ సింగ్ (14 బంతుల్లో 22 నాటౌట్; 4 ఫోర్లు) ఫినిషింగ్ టచ్ ఇచ్చాడు. భారత్ విజయానికి ఆఖరి బంతికి ఒక పరుగు అవసరంకాగా... సీన్ అబాట్ వేసిన బంతిని రింకూ సింగ్ సిక్సర్‌గా మలిచి భారత విజయాన్ని ఖరారు చేశాడు. అయితే టీవీ రీప్లేలో అబాట్ వేసిన బంతి నోబాల్ అని తేలడంతో అక్కడే భారత విజయం ఖాయమైంది. దాంతో రింకూ సింగ్ సిక్స్‌ను లెక్కలోకి తీసుకోలేదు. టి20ల్లో భారత జట్టుకిదే అత్యధిక ఛేజింగ్ కావడం విశేషం. సిరీస్‌లోని రెండో టి20 మ్యాచ్ ఈనెల 26న తిరువనంతపురంలో జరుగుతుంది.


సూర్య


జోష్ ఇన్‌గ్లిస్

సూర్య, ఇషాన్ ధనాధన్

భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్‌కు శుభారంభం లభించలేదు. ఓపెనర్ యశస్వి జైస్వాల్ (8 బంతుల్లో 21; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు)తో సమన్వయలోపం కారణంగా మరో ఓపెనర్ రుతురాజ్ గైక్వాడ్ (0) ఒక్క బంతి ఆడకుండానే తొలి ఓవర్లోనే రనౌటయ్యాడు. అనంతరం మూడో ఓవర్లో యశస్వి భారీ షాట్‌కు యత్నించి నిష్క్రమించాడు. ఈ దశలో ఇషాన్, సూర్యకుమార్ జత కలిశారు. వీరిద్దరు ఎక్కడా తగ్గకుండా ఆసీస్ బౌలర్లపై విరుచుకుపడ్డారు. దాంతో భారత్ స్కోరు 4.5 ఓవర్లలో 50 దాటింది. పవర్‌ప్లే ముగిసే సరికి భారత్ 2 వికెట్లకు 63 పరుగులు సాధించింది. ఆ తర్వాత కూడా ఇషాన్, సూర్య జోరు కొనసాగించడంతో భారత్ 9.1 ఓవర్లలో 100 పరుగులు చేసింది. ఇషాన్ 37 బంతుల్లో అర్ధ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఇన్నింగ్స్ 13వ ఓవర్లో భారీ షాట్‌కు యత్నించి డీప్ ఎక్స్‌ట్రా కవర్‌లో షార్ట్ చేతికి చిక్కడంతో ఇషాన్ ఇన్నింగ్స్ ముగిసింది. తిలక్ వర్మ (10 బంతుల్లో 12; 2 ఫోర్లు) ఎక్కువసేపు క్రీజులో నిలువలేకపోయాడు. ఈ దశలో సూర్య, రింకూ జతకలిసి ఐదో వికెట్‌కు 40 పరుగులు జోడించడంతో భారత్ 194/4తో విజయానికి చేరువైంది. అయితే ఇదే స్కోరు వద్ద సూర్య అవుటయ్యాడు. అప్పటికి భారత్ విజయానికి చేరువైంది.

చివరి ఓవర్ డ్రామా...

12 బంతుల్లో 14 పరుగులు చేయాల్సిన దశలో 19వ ఓవర్లో భారత్ 7 పరుగులు చేసింది. దాంతో చివరి ఓవర్లో భారత్ గెలుపునకు 6 బంతుల్లో 7 పరుగులు అవసరమయ్యాయి. తొలి బంతికే రింకూ ఫోర్ కొట్టాడు. రెండో బంతికి 'బై' రూపంలో పరుగు వచ్చింది. 4 బంతుల్లో 2 పరుగులు చేయాల్సిన దశలో భారత్ వరుసగా మూడు బంతుల్లో అక్షర్ పటేల్, రవి బిష్ణోయ్, అర్ష్‌దీప్ వికెట్లను కోల్పోయింది. రెండో పరుగు పూర్తి చేసే క్రమంలో అర్ష్‌దీప్ అవుటయ్యాడు. దాంతో చివరి బంతికి భారత్ విజయానికి ఒక పరుగు అవసరమైంది. 'సూపర్ ఓవర్' అవసరం పడుతుందా అనే అనుమానం కలిగిన దశలో అబాట్ వేసిన ఆఖరి బంతిని రింకూ సిక్స్‌గా మలచడంతో భారత్ విజయం ఖరారైంది. అయితే అబాట్ బంతి నోబాల్ అని తేలడంతో రింకూ సిక్స్ షాట్‌ను పరిగణనలోకి తీసుకోలేదు.



ఇషాన్

స్కోరు వివరాలు

ఆస్ట్రేలియా ఇన్నింగ్స్: స్టీవ్ స్మిత్ (రనౌట్) 52; మాథ్యూ షార్ట్ (బి) రవి బిష్ణోయ్ 13; జోష్ ఇన్‌గ్లిస్ (సి) యశస్వి జైస్వాల్ (బి) ప్రసిధ్ కృష్ణ 110; స్టొయినిస్ (నాటౌట్) 7; టిమ్ డేవిడ్ (నాటౌట్) 19; ఎక్స్‌ట్రాలు 7; మొత్తం (20 ఓవర్లలో 3 వికెట్లకు) 208. వికెట్ల పతనం : 1–31, 2–161, 3–180. బౌలింగ్: అర్ష్‌దీప్ సింగ్ 4–0–41–0, ప్రసిధ్ కృష్ణ 4–0–50–1, అక్షర్ పటేల్ 4–0–32–0, రవి బిష్ణోయ్ 4–0–54–1, ముకేశ్ కుమార్ 4–0–29–0.

భారత్ ఇన్నింగ్స్: యశస్వి జైస్వాల్ (సి) స్మిత్ (బి) షార్ట్ 21; రుతురాజ్ గైక్వాడ్ (రనౌట్) 0; ఇషాన్ కిషన్ (సి) షార్ట్ (బి) తన్వీర్ 58; సూర్యకుమార్ యాదవ్ (సి) ఆరన్ హార్డీ (బి) బెహ్రెన్‌డార్ఫ్ 80; తిలక్ వర్మ (సి) స్టొయినిస్ (బి) తన్వీర్ సంఘా 12; రింకూ సింగ్ (నాటౌట్) 22; అక్షర్ పటేల్ (సి అండ్ బి) సీన్ అబాట్ 2; రవి బిష్ణోయ్ (రనౌట్) 0; అర్ష్‌దీప్ సింగ్ (రనౌట్) 0; ముకేశ్ కుమార్ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 14; మొత్తం (19.5 ఓవర్లలో 8 వికెట్లకు) 209. వికెట్ల పతనం: 1–11, 2–22, 3–134, 4–154, 5–194, 6–207, 7–207, 8–208. బౌలింగ్: స్టొయినిస్ 3–0–36–0, బెహ్రెన్‌డార్ఫ్ 4–1–25–1, షార్ట్ 1–0–13–1, సీన్ అబాట్ 3.5–0–43–1, నాథన్ ఎలిస్ 4–0–44–0, తన్వీర్ సంఘా 4–0–47–2.

సామ్యూల్స్‌పై ఆరేళ్ల నిషేధం



దుబాయ్: అవినీతి నిరోధక నియమావళిని ఉల్లంఘించినందుకు వెస్టిండీస్ మాజీ క్రికెటర్ మార్లోన్ సామ్యూల్స్‌పై అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) ఆరేళ్ల నిషేధం విధించింది. 2019లో అబుదాబిలో జరిగిన టి10 లీగ్ సందర్భంగా సామ్యూల్స్ గుర్తుతెలియని వ్యక్తుల నుంచి లబ్ధి పొందాడని... ఎన్నిసార్లు అతడిని విచారించినా వాటికి సంబంధించిన వివరాలు ఇవ్వకపోవడంతో నిషేధం విధిస్తున్నట్లు ఐసీసీ తెలిపింది. 42 ఏళ్ల సామ్యూల్స్ 2012, 2016లలో టి20 ప్రపంచకప్ సాధించిన వెస్టిండీస్ జట్టులో కీలక సభ్యుడిగా వ్యవహరించాడు. 2008లో మ్యాచ్ ఫిక్సింగ్‌కు పాల్పడటంతో రెండేళ్ల నిషేధానికి గురైన సామ్యూల్స్ వెస్టిండీస్ తరఫున 71 టెస్టులు (3917 పరుగులు; 41 వికెట్లు), 207 వన్డేలు (5606 పరుగులు; 89 వికెట్లు), 67 టి20 మ్యాచ్‌లు (1611 పరుగులు; 22 వికెట్లు) ఆడాడు.

హైదరాబాద్ బోణీ


రాహుల్

జైపూర్: విజయ్ హజారే ట్రోఫీ దేశవాళీ వన్డే క్రికెట్ టోర్నమెంట్‌లో హైదరాబాద్ జట్టు శుభారంభం చేసింది. మణిపూర్ జట్టుతో జరిగిన గ్రూప్ 'బి' లీగ్ మ్యాచ్‌లో హైదరాబాద్ ఐదు వికెట్ల తేడాతో గెలిచింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన మణిపూర్ సరిగ్గా 50 ఓవర్లలో 203 పరుగులకు ఆలౌటైంది. హైదరాబాద్ బౌలర్లలో రవితేజ (3/71), రక్షణ్ రెడ్డి (2/28), తనయ్ త్యాగరాజన్ (2/24) రాణించారు. అనంతరం హైదరాబాద్ కేవలం 29.5 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 208 పరుగులు చేసి నెగ్గింది. హైదరాబాద్ కెప్టెన్ గౌహత్ రాహుల్ సింగ్ (47 బంతుల్లో 70; 13 ఫోర్లు), చందన్ సహని (32 బంతుల్లో 41; 4 ఫోర్లు, 1 సిక్స్), రవితేజ (11 బంతుల్లో 23 నాటౌట్; 1 ఫోర్, 2 సిక్స్‌లు) దూకుడుగా ఆడారు.

ఆంధ్ర పరాజయం

మరోవైపు చండీగఢ్‌లో ఆంధ్ర జట్టు పరాజయంతో ఈ టోర్నీని ప్రారంభించింది. గ్రూప్ 'డి'లో భాగంగా హిమాచల్ ప్రదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో ఆంధ్ర జట్టు ఏడు వికెట్ల తేడాతో ఓడిపోయింది. ముందుగా ఆంధ్ర జట్టు 47.3 ఓవర్లలో 206 పరుగులకు ఆలౌటైంది. నితీశ్ రెడ్డి (59 బంతుల్లో 47; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు), మనీశ్ గోలమారు (60 బంతుల్లో 46; 5 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు. అనంతరం హిమాచల్ ప్రదేశ్ 43.3 ఓవర్లలో 3 వికెట్లకు 212 పరుగులు చేసి విజయం సాధించింది. అమిత్ (78 నాటౌట్; 11 ఫోర్లు), ఆకాశ్ వశిష్ట్ (53; 2 ఫోర్లు) అర్ధ సెంచరీలు సాధించారు.